ఎస్‌టి మాకివలసలో గ్రామసభ పిఎంఎం జన్మన్ ప్రోగ్రాం

విశాలాంధ్ర - జలుమూరు : మండలం అచ్యు తాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మఱ్రివలస పంచాయతీ ఎస్టీ మాకు వలస జమిని వలస గ్రామాల్లో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. పి. ఎంఎం జన్మన్ ప్రోగ్రాం అభివృద్ధి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వి.ఉమా మహేశ్వరరావు, తాసిల్దార్ జి.లక్ష్మీనారాయణ, వ్యవసాయ అధికారి కే సురేష్, సచివాలయ సిబ్బంది అచ్యుతాపురం ప్రాథమిక వైద్యాధికారిని ప్రసన్న లక్ష్మి, సిబ్బంది ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా పవన్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - మందస : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకులు బలియవాడ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన బాలబాలికలకు పుస్తకాలు, బట్టలు, పెన్నులు సంయుక్త కార్యదర్శి దిలీప్ కుమార్ పాణిగ్రాహి అందజేశారు. కార్యక్రమంలో దున్న హరిక్రిష్ణ, మట్ట ధర్మ, గేదెల రమణ, లోకేష్, భరత్‌వర్ష, ముక్కల నీలకంఠంలు పాల్గొన్నారు.

రేపు దివంగత మాజీ ఎంపీ దొర వర్ధంతి వేడుకలు



విశాలాంధ్ర - పలాస : దివంగత మాజీ ఎం.పి హనుమంతు అప్పయ్యదొర వర్ధంతి వేడుకలు గురువారం కాశీబుగ్గ కె.టి రోడ్డులో గల దొర విగ్రహం వద్ద జరపనున్నట్లు దొర అభిమానులు, కుటుంబ సభ్యులు ప్రకటనలో తెలిపారు. పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో ఆఫ్‌షోర్ రిజర్వాయరు ద్వారా సాగు, తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు పరితపించిన నేతగా ఈ ప్రాంత ప్రజల్లోను, రైతాంగంలో కొలువై ఉన్నారు. 1934లో జన్మించిన అప్పయ్యదొర 1961లో మొట్టమొదటి సారిగా బెండి సర్పంచ్‌గా పని చేశారు. 1981లో సమితి ప్రెసిడెంట్‌గా, 1985లో శ్రీకాకుళం జిల్లా పార్లమెంటు సభ్యునిగా, 1994, 2004లో టెక్కలి నియోజకవర్గ ఎమ్మెల్యేగాను, ఎపి లెజిస్లేటివ్ సబార్డినేట్ కమిటీ, చైర్మన్‌గా కూడా పని చేశారు. ఈ కార్యక్రమానికి దొర అభిమానులు హాజరుకావాలని కోరారు.

చట్టపరమైన అంశాలపై విద్యార్థినులకు అవగాహన

విశాలాంధ్ర - జలుమూరు : మండల కేంద్రము జలుమూరు కెవిఎన్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో చట్టపరమైన అంశాలపై మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఇప్పిలి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నిత్య జీవితంలో చట్టాల ఆవశ్యకతను వివరించారు. మరియు ప్రాధాన్యతలను సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయునీ ఎన్ వాసంతి విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీలవేణి, రాధిక, సుశీల, ఉజ్వల, ప్రభావతి, శ్రీదేవి, లక్ష్మీ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకే మట్టి విగ్రహాలు మోహన్ గాంధీ

విశాలాంధ్ర - జలుమూరు : పర్యావరణాన్ని పరిరక్షించే దిశలో నేటియువత పాత్ర చాలా అవసరమని సారవకోట మండలం అవలంగి జేబిటీ పాఠశాల వ్యవస్థాపకులు జోగు మహంతి మోహన్ గాంధీ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం పాఠశాల ఆవరణలో పిల్లలచే మట్టి గణపతి ప్రతిమలను తయారు చేయించారు. గత 13 సంవత్సరాలుగా మట్టి విగ్రహాలు తయారు చేస్తూ ప్రజలకు ఉచితంగా అందజేస్తున్నామని ఆయన తెలిపారు. యువత పాత్ర చాలా అవసరమనే ఉద్దేశంతో బాల్యం నుండి చిన్నారులకి అలవర్చాలనే ధ్యేయమే పాఠశాల లక్ష్యమని మోహన్ గాంధీ అన్నారు.

ఘనంగా 'శ్రీ కృష్ణ భగవానుడు' ఊరేగింపు

విశాలాంధ్ర - నరసన్నపేట : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక, తలనమ్ముద్రం కమిటీ ఆధ్వర్యంలో సోమ వారం సాయంత్రం శ్రీ కృష్ణాష్టమి జన్మదిన వేడుకల్లో భాగంగా శ్రీ కృష్ణ భగవానుడు ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి, మాజీ ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్ శ్రీ కృష్ణుడును దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక జగన్నాధపురం వీధి నుండి పాత బస్టాండ్ మీదుగా పల్లిపేట జంక్షన్ వరకూ ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు, శ్రీనివాస్, ప్రతినిధులు, రాము, ధన్వంతరి, రమేష్, జ్యోతి, భాగ్యలక్ష్మీ, దినేష్ సాయి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలి : సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర - పాతపట్నం/మెలియాపుట్టి : నిత్యవసర తదితర వస్తువుల ధరల నియంత్రణలో ప్రభుత్వలు వైఫల్యం చెందాయని పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకట్రావు అన్నారు. సిపిఐ జాతీయ సమితి పిలువులో భాగంగా పెరిగిన నిత్యవసర వస్తువులు ధరలపై 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు జరిగే ప్రచార, నిరసన కార్యక్రమాలకు సంబంధించి వాల్ పోస్టర్ ను పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం విడుదల చేశారు. అనంతరం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయన్నారు. ధరల నియంత్రణ లేకపోవడంతో పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను కేంద్రంలో మోడీ ప్రభుత్వం అనేకసార్లు పెంచి సామాన్య ప్రజలకు అవస్థలకు గురి చేసిందన్నారు. జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్న అధిక ధరలను నియంత్రించి పెరిగిన ధరలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.

డిమాండ్స్... పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని, ధరల స్థిరీకరణకు బడ్జెట్లో తగు నిధులు కేటాయించాలని, అర్హులై ఉండి కార్డు లేనివారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, ఆహార భద్రత చట్టం అమలు చేయాలని, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలని, రేషన్ కార్డుదారులకు ఈకేవైసి ప్రక్రియ సులభతరం చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆయనతో పాటు సిపిఐ పార్టీ నాయకులు ఎం. తులసి, ఆదినారాయణ, దేవేంద్ర, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

సోంపేట : విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్యులు విలవిలలాడుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర సుందర్‌లాల్ పేర్కొన్నారు. నిత్యావసర సరుకులు కొనుగోలు చేయలేక సరైన ఆహారానికి నోచుకోక పేద, మధ్యతరగతి ప్రజల పరిస్థితి దారుణంగా మారిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సామాన్యుల నడ్డి విరుగుతున్నా పట్టించుకోకపోవడం ఘోరమని అన్నారు. సోంపేటలో చాపర వెంకటరమణ, సీపీఐ నాయకులు, కార్యకర్తలతో కలిసి మంగళవారం పెరిగిన నిత్యావసర ధరలపై వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ధ్వజమెత్తారు. కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని అన్నారు. పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోందని అన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను మోడీ ప్రభుత్వం తీవ్రంగా పెంచి సామాన్య ప్రజలకు తీవ్రంగా అన్యాయం చేసిందని పేర్కొన్నారు. అధిక ధరలను అరికట్టి సామాన్యులకు మేలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సాలిన నారాయణస్వామి, రాష్ట్ర మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పుక్కళ్ల అరేలమ్మ, ఐనింటి లోకనాథం, సోమేష్, లోకనాథం, హరిపాత్రో తదితరులు పాల్గొన్నారు.

లియో గ్లోబల్ ఓవర్సీస్‌తో 'పద్మావతి' కళాశాల ఒప్పందం

విశాలాంధ్ర - నరసన్నపేట : ప్రముఖ అంతర్జాతీయ విద్యా సంస్థ, లియో గ్లోబల్ ఓవర్సీస్‌తో పద్మావతి డిగ్రీ కళాశాల ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల డైరక్టర్, సిహెచ్.దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో లియో గ్లోబల్ ఓవర్సీస్ సంస్థ ప్రతినిధి, మహేంద్ర లంకా మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విధ్యార్థులకు విదేశీ విద్యపై అవగాహన, అంతర్జాతీయ భాషా నైపుణ్య పరీక్షలైన టోఫెల్, జి.ఆర్.ఈ, డ్యూలింగో తదితర కోర్సులకు ఉచితంగా శిక్షణ అందిస్తామని అన్నారు. రానున్న రోజుల్లో పద్మావతి కళాశాలలో ప్రత్యేక విదేశీ విద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా లియో గ్లోబల్ ఓవర్సీస్ ఛైర్మన్, లగడపాటి శ్రీనివాస్‌కు పద్మావతి డిగ్రీ కళాశాల యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసింది. ఈ కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు, డా.మాకేన సతీష్, కళాశాల అకడమిక్ ఇంఛార్జ్, ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

థర్మల్ విద్యుత్ కేంద్ర ఉద్యమకారులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి ఎంపీ కలిశెట్టిని కోరిన బీసీ సంఘం నేతలు

విశాలాంధ్ర - రణస్థల : సోంపేట మండలం బీల భూముల్లో పర్యావరణానికి హానికరమైన థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఆందోళన చేసిన ఉద్యమకారులపై 2010, జూలై 14న నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి కాల్పులు జరిపించి ముగ్గురు వ్యక్తులను బలిగొనడమే కాకుండా మొత్తం 723 మందిపై వివిధ సెక్షన్ల కింద తప్పుడు కేసులు పెట్టారని బీ సీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, బీన ఢిల్లీ రావు, ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షులు, చౌదరి లక్ష్మణరావు అన్నారు. మంగళవారం వారు టీడీపీ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుని రణస్థలంలోని తన కార్యాలయంలో బీసీ సంఘం నేతలతో కలిసి ఉద్యమకారులపై తప్పుడు కేసులు ఎత్తివేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తాను నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి గారితో కలిసి బీల ప్రాంతాన్ని సందర్శించిన విషయాన్ని గుర్తుచేశారు. ఉద్యమకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళతానన్నారు. వారి వెంట బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు ఆలీ బేగ్, మహిళా అధ్యక్షురాలు బద్రి సీతమ్మ ఉన్నారు.

డిగ్రీ విద్యార్థులకు అన్ని విభాగాల్లో శిక్షణ

విశాలాంధ్ర - పలాస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో నిలదొక్కుకొనేందుకు వీలుగా అన్ని విభాగాల్లో శిక్షణ మరియు అవగాహన కల్పించే బోధన జరుగుతుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటలక్ష్మీ అన్నారు. మంగళవారం డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు దీక్షా ఆరంభ్ ఇండక్షన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు అంశాలపై సూచనలు చేశారు. రాబోయే పరీక్షలు సెమీస్టారు విధానంలో ఉంటాయని, అందుకు తగ్గట్టుగా విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. కళాశాలలో విద్యార్థులకు సబ్జెక్టులతో పాటు వివిధ పోటీ పరీక్షలు ఎదుర్కొనేలా ఉన్నత ఉద్యోగాలు పొందే విధంగా వర్తమాన పరిస్థితులు ప్రతి రోజు వివరించే కార్యక్రమం ఉంటుందని అన్నారు. దీంతో పాటు కమ్యూనికేషన్స్ స్కిల్స్, మెంటల్ ఎబిలిటీ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కళాశాలలో ఉన్న ఎన్ఎస్ఎస్ మరియు క్రీడలు, గ్రంధాలయం వంటి సౌకర్యాలు వినియోగించుకొని ఉన్నత లక్ష్యాలను సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ గణపతి, పి.డి పి.మధు, లైబేరీయన్ నర్సింహులు, ఉపన్యాసకులు హేమాచలం, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

డెంగ్యూ, సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - టెక్కలి : ప్రస్తుతం మారిన వాతావరణం లో ప్రజలందరు కొత్త సమస్యలు ఎదుర్కోవలసి ఉంది. వాతావరణ మార్పుల కారణంగా ప్రజలు అనారోగ్య పరిస్థితికి గురవుతున్న విషయం తెలిసిందే. అందులో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు మరియు వ్యాప్తి చెందే వ్యాధులు ఎక్కువగా ప్రజ్వరిలుతాయి. కావున ప్రజలు ఎప్పటికప్పుడు ఆరోగ్య స్థితిపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు. ప్రజలకు అవగాహన పరిచేదిగా "విశాలాంధ్ర" డాక్టర్ రాజశేఖర్ తో సంభాషించి మరిన్ని విషయాలు ప్రజలు ముందుకు అప్రమత్తం చేసేందుకు తీసుకువచ్చింది. డెంగ్యూ, సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సిగిలిపల్లి రాజశేఖర్ ఎంబీబీఎస్ (డిసిహెచ్, డిఎన్బి పెడియాట్రిక్స్) అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల ఫలితంగా సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులతో పాటు విష జ్వరాలు వచ్చే అవకాశం అధికంగా ఉంటుందన్నారు. వీటి బారిన పడకుండా తగు జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ముఖ్యంగా అత్యంత ప్రమాదకరమైనది డెంగ్యూ అని వీలైనంతవరకు పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచాలని అన్నారు. ఈ వ్యాధి దోమల ద్వారా వ్యాప్తి చెందే భయంకరమైన వ్యాధి అని, ప్రస్తుతం వర్షాలు పడటం వలన దోమలు బెడద ఎక్కువగా ఉంటుందని, అది ఒకరి నుండి మరొకరికి సోకుతుందని తెలిపారు. ఈ డెంగ్యూ దోమలు ఎక్కువగా ఇంటి సమీపంలో నీరు నిల్వ ఉండే చోటులో, పూల తొట్టెలో, నీటి ట్యాంకులలో, టైర్లలో, వ్యర్థ పదార్థాలలో గుడ్లు పెడుతూ వాటి సంఖ్యను పెంచుకుంటాయి. కనుక ఇంట బయట నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. సీజనల్ వైరల్ జ్వరాలు... సీజనల్ వైరల్ జ్వరాలు మారుతున్న వాతావరణ విధానాలతో సంభవించే ఆరోగ్య సమస్యలు, సాధారణంగా నిర్దిష్ట సీజన్లలో ప్రజలను ప్రభావితం చేస్తాయి. ఈ జ్వరాలు వివిధ వైరస్‌ల వల్ల సంభవిస్తాయి మరియు తీవ్రతలో తేలికపాటి నుండి తీవ్రమైన వరకు మారవచ్చు. వాటి లక్షణాలు మరియు నివారణ చర్యలను అర్థం చేసుకోవడం వాటి ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని అన్నారు. సీజనల్ వైరల్ జ్వరాలు ప్రధానంగా సంవత్సరంలో నిర్దిష్ట సమయాల్లో మరింత చురుకుగా ఉండే వైరస్‌ల వల్ల సంభవిస్తాయి. చలికాలంలో తరచుగా ఇన్ఫ్లుఎంజా (ఫ్లూ), రైనోవైరస్‌లు, వర్షాకాలంలో డెంగ్యూ మరియు చికున్‌గున్యా వైరస్‌లు , వేసవి చివరలో ఎంట్రోవైరస్‌లు సర్వసాధారణం అని తెలిపారు.

సీజనల్ వైరల్ జ్వరాల లక్షణాలు... అధిక జ్వరం: తరచుగా ఆకస్మికంగా మరియు 101ఎఫ్ (38.3సి) పైన చేరుకోవచ్చు, చలి మరియు చెమటలు, తలనొప్పి: తేలికపాటి నుండి తీవ్రమైన వరకు ఉంటుందిని, 4.కండరాలు మరియు కీళ్ల నొప్పులు, దగ్గు మరియు గొంతు నొప్పి, వికారం మరియు వాంతులు మొదలగు లక్షణాలు వంటివి ఉంటాయని తెలిపారు. ట్రీట్మెంట్... చికిత్స సాధారణంగా లక్షణాల నుండి ఉపశమనం పొందడంపై దృష్టి పెట్టాలిని, ఎందుకంటే చాలా వైరల్ జ్వరాలు వాటంతట అవే పరిష్కారమవుతాయి. విశ్రాంతి మరియు హైడ్రేషన్: కోలుకోవడానికి మరియు డీహైడ్రేట్ అవకుండా సహాయం అవుతుంది. (వెచ్చని నీరు, ఓఆర్ఎస్, కొబ్బరి నీల్లు, మజ్జిగ, పండ్ల రసాలు వంటివి) యాంటిపైరేటిక్స్: జ్వరాన్ని తగ్గించడానికి పారాసెటమాల్ లేదా ఇబుప్రోఫెన్ వంటి మందులు. **ఓవర్-ది-కౌంటర్ మందులు:** దగ్గు మరియు జలుబు వంటి లక్షణాల కోసం. - యాంటీవైరల్ మందులు: ఇన్ఫ్లుఎంజా వంటి నిర్దిష్ట వైరస్ల కోసం, యాంటీవైరల్ మందులు సూచించబడవచ్చు అని తెలిపారు.

నివారణ చర్యలు...పరిశుభ్రత పద్ధతులు: క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం మరియు అనారోగ్యంతో ఉన్న వ్యక్తులతో సన్నిహిత సంబంధాన్ని నివారించడం.

వెక్టర్ నియంత్రణ, దోమల నివారణ: దోమల కాటును తగ్గించే చర్యలు డెంగ్యూ మరియు చికున్‌గున్యాను నివారించగలవు.

టీకాలు వేయడం: వార్షిక ఫ్లూ టీకాలు కాలానుగుణ ఇన్ఫ్లుఎంజా నుండి రక్షించగలవు అని అన్నారు. సీజనల్ వైరల్ జ్వరాలు సాధారణమైనప్పటికీ, చాలా అసౌకర్యాన్ని కలిగిస్తాయి మరియు అప్పుడప్పుడు సమస్యలకు దారితీస్తాయి. ఈ జ్వరాల యొక్క కాలానుగుణ విధానాల గురించి తెలియజేయడం మరియు నివారణ చర్యలు తీసుకోవడం వల్ల వాటి ప్రభావాన్ని బాగా తగ్గించవచ్చుని తెలిపారు. లక్షణాలు తీవ్రంగా ఉంటే లేదా కొనసాగితే, సరైన చికిత్స కోసం సంబంధించిన వైద్యులను సంప్రదించడం చాలా అవసరం అని అన్నారు. ముఖ్యంగా మానవాళి మనుగడ బాగుండాలి అంటే పరిసర ప్రాంతాలను ప్రకృతిని కాపాడుకోవాలని, ఈ సందర్భంగా ఆయన సందేశాన్ని తెలియపరిచారు.

తైక్వాండో మాస్టర్‌గా కొమర భాస్కర్

- జార్ఖండ్ లో జరిగిన మాస్టర్స్ తైక్వాండో పరీక్షల్లో ప్రతిభ. మాస్టర్ గా అర్హత
- 35 ఏళ్లగా మార్షల్ ఆర్ట్స్ లో విశేషంగా సేవలు
- జిల్లాలో తైక్వాండో క్రీడాభివృద్ధికి నిర్విరామంగా కృషి

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ఆత్మరక్షణ విద్య తైక్వాండోలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన కొమర భాస్కరరావు మాస్టర్ గా అర్హత సాధించారు. ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలోగల కేల్గాం స్టేడియంలో 112వ అంతర్జాతీయ తైక్వాండో మాస్టర్ కోర్స్, 62వ పూండాన్ ఎగ్జామినర్ కోర్స్ నిర్వహించారు. ఈ కోర్సుకు ప్రపంచ తైక్వాండో హెడ్ క్వార్టర్స్ ఆఫీసర్, చీఫ్ ఆఫ్ వరల్డ్ తైక్వాండో అకాడమీ మాస్టర్ జైవన్ కాంగ్, తైక్వాండో మాస్టర్స్ యూనియన్ గ్రాండ్ మాస్టర్ వ్యవస్థాపక అధ్య క్షుదు హాంగ్ కిట్లు హాజరయ్యారు. వారి పర్యవేక్షణలో జరిగిన కోర్సులో జిల్లాకు చెందిన తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు పాల్గొన్నారు. ఇంటర్నేషనల్ మాస్టర్, హెూమ్ దాన్ ఎగ్జా మినర్గా అర్హత సాధించడం విశేషం. జిల్లా నుంచి తైక్వాండో మాస్టర్ గా ఎంపికైన మొట్టమొదటి జిల్లా వాసిగా గుర్తింపు పొందారు.

మార్షల్ ఆర్ట్స్ లో 35 ఏళ్లగా సేవలు... జిల్లాలో 35 ఏళ్లగా మార్షల్ ఆర్ట్స్ లో సుదీర్ఘంగా సేవలు అందిస్తూ వేలాది మందిని తీర్చిద్దిన ఘన చరిత్రను సొంతం చేసుకున్నారు కొమర భాస్కర్. ఈయన తైక్వాండో జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తునే.. న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా సేవలు అందిస్తున్నారు. అంతర్జాతీయ తైక్వాండో మాస్టర్ కోర్స్ సంపూర్ణంగా చేయడం సంతోషంగా ఉందని భాస్కర్ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

అభినందనల వెల్లువ... జిల్లా నుంచి తైక్వాండో మాస్టర్ గా కొమర భాస్కర్ అర్హత సాధించడం పట్ల సర్వత్రా అభినందనలు వ్యక్తమౌతున్నాయి. తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎంవీ రమణ, డీ.ఎస్.డీ.ఓ డాక్టర్ శ్రీధర్ రావు, రెడ్డి శివకుమార్, తారక్, సంఘ ప్రతినిధులు, కోచ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

నడి సముద్రంలో నావ విజయవాడ.. చంద్రబాబు సేవలు ప్రశంసనీయం ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర - నరసన్నపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి, నారా చంద్రబాబునాయుడు విజయవాడ వరద బాధితులకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని నియోజకవర్గ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో పేర్కొంటూ ఒక ప్రక్క బుడమేరు పొంగి ప్రవహిస్తుంటే, మరో ప్రక్క కృష్ణమ్మ పొంగి పరవళ్ళు త్రొక్కుతుంటే, విజయవాడ ప్రజానీకం అరచేతిలో ప్రాణాలు పెట్టుకొనే పరిస్థితి ఏర్పడిందని, విజయవాడ నడి సముద్రంలో నావలా వుందని తెలిపారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మన ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు వరద బాధితుల కోసం పడే శ్రమ, కష్టాన్ని చూస్తుంటే కడుపు తరుక్కుపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మధ్యనే వుంటూ, వారిని ఆదుకునే పరిస్థితి చూస్తుంటే ముఖ్యమంత్రి అంటే నారా చంద్రబాబునాయుడే అని ప్రజానీకం చర్చించుకుంటున్నారు. గతంలో విశాఖపట్నంకు వచ్చిన హుదూద్ తుఫాన్‌లో ప్రజలకు ఎలా ఆదుకున్నారో, అలా నేడు విజయవాడ ప్రజలందరూ మాకు అలాగే ఆదుకుంటున్నారని చెపుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం హాయాంలో సైకో ముఖ్యమంత్రి, జగన్మోహన్‌రెడ్డి రెడ్ కార్పెట్‌లలో వెళ్ళడం కాకుండా పడవపై వెళుతున్నాడు. అలాగే జెసిబిపై వెళ్ళటమే కాకుండా నడుం లోతు వరద నీటిలో దిగి వెళుతున్న చంద్రబాబు పడుతున్న కష్టాన్ని ప్రజలు గమనిస్తున్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రజల కష్టాలు తీర్చగలడన్న విశ్వాసం ప్రజల్లో వుందని రమణమూర్తి అన్నారు.

కమిషనర్ సేవలు మరువలేనివి : మున్సిపల్ ఛైర్మన్ గిరిబాబు

విశాలాంధ్ర - పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ కమిషనర్‌గా రెండోసారి 18 నెలలు విధులు నిర్వహించిన కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మున్సిపాలిటీకి చేసిన సేవలు మరువలేనివని మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా పలాస కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగేంద్రకుమార్‌కు కొవ్వూరుకు బదిలీ చేయడంతో మంగళవారం మున్సిపల్ సమావేశ మందిరంలో వీడ్కోలు సమావేశం నిర్వహించి ఆయనకు ఛైర్మన్‌తో పాటు మున్సిపల్ అధికారులు శాలువ కప్పి సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఛైర్మన్ గిరిబాబు మాట్లాడుతూ నాగేంద్రకుమార్ గతంలో కూడా కరోనా సమయంలో విపత్కర పరిస్థితుల్లో చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ప్రజల మన్ననలను పొందారన్నారు. 18 నెలల క్రితం మరోమారు కమిషనర్‌గా ఇక్కడ బాధ్యతలు చేపట్టిన నుంచి ప్రతి సమస్యను పరిష్కరించి ప్రజల మొప్పు పొందారని, అంతే కాకుండా ఎన్నో ఏళ్లగా అక్రమంలో ఉన్న ఆంధ్రాబ్యాంకు రోడ్డును ఆక్రమణలను తొలగించి యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మాణం చేపట్టడం ఆయనకు కృషి ఫలితమేనన్నారు. తోటి అధికారులతో ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని సమస్యలు పరిష్కారం పైనే ఆయన ప్రత్యేక దృష్టిసారించారని అటువంటి అధికారి బదిలీపై వెళ్లడం బాధాకరమన్నారు. సన్మాన గ్రహిత కమిషనర్ నాగేంద్రబాబు మాట్లాడుతూ పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో రెండుసార్లు కమిషనర్‌గా చేసే అవకాశం దక్కిందని, ఈసారి కె.టి రోడ్డు విస్తరణ, ఆంధ్రాబ్యాంక్ ఆక్రమణలు తొలగింపు వంటి కార్యక్రమాలు చేపట్టగలిగానని ఆనందం వ్యక్తం చేశారు. అయితే అధికారులకు బదిలీలు సర్వసాధారణమని, తాను ఎక్కడా విధులు నిర్వహించినా పలాసలో పని చేసిన కాలం ఇక్కడ సత్సంబందాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డి.ఇ కనకరాజు, ఎ.ఇ అవినాష్, టి.పి.వో అప్పలరాజు, అప్పలస్వామి, మహేష్, అమర్, బెహరాలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించిన మాజీ స్పీకర్ తమ్మినేని

విశాలాంధ్ర - పొందూరు : విశాఖపట్నం అచ్యుతాపురం ఎసెన్షియ ఫార్మా కంపెనీలో గత నెలలో జరిగిన ప్రమాదంలో సుమారు 17 మంది ప్రాణాలు పోయినా విషయం విధితమే. ఆ కుటుంబాలను వైఎస్ఆర్ పార్టీ మానవతా దృక్పథంతో ఆదుకుంటుందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పొందూరు కు సంభందించి హంస ప్రశాంత్ అనే వ్యక్తి సెజ్ ప్రమాదంలో చనిపోయారు. ఆ కుటుంబానికి పార్టీ తరపున 5 లక్షల చెక్కును సోమవారం మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అందజేశారు. పార్టీ అండగా ఉంటుందని ఆ కుటుంబానికి హామీ ఇచ్చారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు తమ్మినేని చిరంజీవి నాగ్, మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, ప్రచార విభాగం జోనల్ ఇన్చార్జి చింతాడ రవికుమార్, జడ్పిటిసి లోలుగు కాంతారావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, కోట గోవిందరావు, వైస్ఎంపీపీ వండాన వెంకటరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బాడాన సునీల్, గుడ్ల మోహన్, జిల్లా మహిళా కన్వీనర్ కూన రవణమ్మ తదితర వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు సర్పంచ్ పాల్గొన్నారు.

నిండిన చెరువులు పొంగుతున్న వాగులు

విశాలాంధ్ర - జలుమూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా సారవకోట, జలుమూరు మండ లాల్లో కురు స్తున్న వర్షాలకు చెరువులు నిండి పొంగి ప్రవహిస్తున్నాయి. చిన్న చిన్న పిల్ల కాలువలు జోరుగా పారుతున్నాయి. చాలా చెరువులు చప్టాలపై పిల్లలకు ఆనందం కలిగించే విధంగా కనిపిస్తు న్నాయి. జలుమూరు మండలం కూర్మనాధపురం గ్రామంలో పిల్లకాలువ గట్టు కు గండి పడటంతో లోతట్టు లో ఉన్న పొలాలలో నీరు చేరింది. నిరంతరం వర్షం వచ్చే సమయాల్లో పంట పొలాల ముంపుకు గురయ్యే ఈ ప్రాంతం చిన్న కాలువ గండికోట్టడం ఈ పొలాల వారికి మేలు జరిగింది.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించినట్టు క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. ఇక్కడి క్యాంపస్లో హాస్టల్ను ఆయన మంగళవారం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆహారం నాణ్యత విషయంలో తగిన జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఆహారానికి వినియోగించే అన్ని పదార్థాల నాణ్యతను పరిశీలిం చారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృ ష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆరోగ్యం బాగోలేదంటూ ఓ ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ వద్దకు పట్టణానికి చెందిన గణ పతి రావు (32) వ్యక్తి వైద్య సేవలకు వెళ్లగా సంచి వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించి ఆ వ్యక్తి మృతికి దారి తీసింది. మృతుని తల్లి ద్రౌపది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంక టేష్ కేసు నమోదు చేసి దర్యాప్ చేయబడు తున్నారు. గణపతరావు మృతికి సంబంధిం చి పోలీసు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. మందస కు చెందిన గణపతి రావు కొన్నాళ్ల గా రాత్రి సమయాల్లో బంగారం షాపుల కాప లా మైత్రి పోలీసుగా కొనసాగుతున్నారు. సోమవారం సాయంత్రం ఒంట్లో బాగోలేదని పో లీస్ స్టేషన్ సమీపంలో ప్రైవేట్ మెడికల్ ప్రా క్టీస్ చేస్తున్న వైద్యుడు బగాన బాబురావు వ ద్దకు వైద్య సేవ కోసం వెళ్ళాడు. మృతునికి ఐ వి (నరం)ఇంజక్షన్ ఇవ్వడంతో డోస్ ఎక్కు వై స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే ప ట్నంలో గల ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించి చూపించగా తమ వల్ల కాదని శ్రీకాకుళం తీ సుకు పోవాలని అక్కడ వైద్యులు సూచించ దంతో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తర లించారు. ఇంజక్షన్ పవర్ ఎక్కువ కావడంతో గణపతి మృతి చెందాడని తల్లి ద్రౌపది ఇచ్చి నటువంటి ఫిర్యాదు మేరకు బాబురావు పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. గణపతి రావు మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగిం చినట్లు పోలీసులు తెలిపారు.

వివరాలు సేకరించిన పోలీసులు... మైత్రి పోలీసు గణపతి రావు ఇంజక్షన్ విక టించి మృతిచెందిన నేపథ్యంలో క్రైమ్ బ్రాంచ్ పోలీసులు మంగళవారం ఉదయం ప్రైవేటు ప్రాక్టీస్నరు బగాన బాబురావు క్లినిక్ ను పరిశీలించి ఆయన వినియోగించడం ఇంజక్షన్ దాని సామర్థ్యం ఇతర వివరాలను సేకరించారు. రాత్రి గణపతి రావు మృతి చెందడంతో పోలీసులు పీఎంపి క్లినిక్ కు తాళాలు వేసి పోలీసులు పట్టుకుని వెళ్లినట్టు సమాచారం. అలాగే పక్కనే ఉన్న మెడికల్ స్టోర్ లో కొన్న ఆ ఐ వి ఆపిల్ బ్యాచ్ నెంబర్ సరిగా లేదని, ఎక్స్పైర్ తేదీ కూడా దగ్గరలోనే ఉందని క్లూస్ టీం పరిశీలనలో వ్యక్తం అయి నట్లు తెలిసింది. మెడికల్ స్టోర్ లో ఇటువంటి కాలం చెల్లిన వాటిని విక్రయిస్తున్నట్లు గత కొంతకాలంగా ఫిర్యాదులు ఉన్నప్పటికీ డ్రగ్ ఇన్స్పెక్టర్లు తూతూ మంత్ర పరిశీలనలు చేస్తు న్నారని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఇది ఇలా ఉండగా ఓ పోలీసు అధికారి తనకు అండగా ఉంటాడని మందస నుంచి తెచ్చా రని తెలుస్తుంది. మృతుడు గణపతి రావు కు డ్రైవింగ్ కూడా వచ్చును. వైద్యుడు ఐ వి ఇచ్చేందుకు అర్హత లేనప్పటికీ బలవంతం చేశారని అందుకే ట్రీట్మెంట్ ఇచ్చానని బాబు రావు తెలిపారు. షుగర్ బిపి వంటి వాటిని పరిశీలించకుండా ఐవి ఇచ్చారని విచారణ అధికారుల ముందు వైద్యుడు ఒప్పుకున్నట్లు తెలిసింది. ఏది ఏమైనప్పటికీ దర్యాప్తులో పూర్తి అంశాలు వెల్లడి కానున్నాయి.

విద్యుత్ వినియోగదారుల నెత్తిన అధిక చార్జీలు

సామాన్యుడు చెల్లించలేని పరిస్థితి

విశాలాంధ్ర-పలాస/మందస : అధిక విద్యుత్ చార్జీలతో గృహ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి గ్రామాల్లో గృహ వినియోగదారుల మీటర్లు రీడింగ్ తీసి విద్యుత్ బిల్లులను సిబ్బంది అందజేస్తున్నారు. బిల్లులు చూసిన వినియోగ దారులు గుండెలు బాదుకుంటున్నారు. విద్యుత్ చార్జీలు పెంపు విషయంపై ప్రభుత్వం ప్రకటన చేయకుండానే విద్యుత్ చార్జీలు పెంచడం పట్ల తీవ్ర విమర్శలకు దారితీస్తుంది. ఒక్కొక్క వినియోగదారుడికి జూలై నెల చెల్లించిన బిల్లు కన్నా ఈ నెలలో రెండింతలతో(రెట్టింపు చార్జీలు) విద్యుత్ బకాయిలు చెల్లించాలంటూ మీటర్ రీడింగ్ తీసిన రసీదులు ఇస్తున్నారు. మునుపెన్నడు లేనివిధంగా ఒక్కసారి రెట్టింపు బిల్లు చార్జీలు చెల్లింపు రసీదులు అందడం పట్ల వినియోగదారులు తీవ్ర ఆందోళనకు గురవు తున్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఇదే విధంగా విద్యుత్ చార్జీలను గృహ వినియోగ దారుల నుండి వసూళ్లు జరిగాయి. అప్పట్లో అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో ఈ ఏడాది జరిగిన అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల జరగకముందు ఫిబ్రవరి నెల నుంచి విద్యుత్ చార్జీలు వైసిపి ప్రభుత్వం తగ్గించింది. వైసీపీ పాలనలో విద్యుత్ చార్జీలు పెంచడంతో దానికి నిరసనగా ప్రతిపక్షంలో ఉన్న అప్పటి తెలుగుదేశం పార్టీ బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టి నిరసన వ్యక్తం చేయడం జరిగింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ నెల నుంచి అధిక విద్యుత్ ఛార్జీలు వసూలు చేసేందుకు విద్యుత్ బిల్ బకాయిల రసీదులు గృహ వినియోగ దారులకు అందజేస్తున్నారు. రాష్ట్ర విద్యుత్ సంస్థ ఎందుకు ఇంత పెద్ద మొత్తంగా విద్యుత్ ఛార్జీలు వసూలు చేస్తుందో స్థానికంగా ఉన్న విద్యుత్ శాఖ సిబ్బంది చెప్పలేకపోతున్నారు. హఠాత్తుగా విద్యుత్ చార్జీలు పెంచడం పట్ల ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. విద్యుత్ చార్జీల పెంపు భారం సామాన్యుడి పై పడటంతో వారు చెల్లించలేని దుస్థితి ఏర్పడింది.

ఏపీ ఎన్జీవో ప్రభుత్వాలతో భాగస్వామ్యం అవుతుంది

- ఏపీ ఎన్జీవోకు పార్టీలతో సంబంధం లేదు
- పుట్టినరోజు వేడుకల్లో ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఏపీ ఎన్జీవో ప్రభుత్వాలతో భాగస్వామ్యం అవుతూ ఆ ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలను పాటించడం జరుగుతోందని ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడు అన్నారు. నగరంలోని గొంటివీధిలో ఏపీఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడు 63వ పుట్టినరోజు వేడుకలను మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పురుషోత్తమనాయుడుకు పెద్ద ఎత్తున పాల్గొని పుట్టినరోజు శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఎన్జీవో సంఘానికి రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్నారు. తాము ప్రభుత్వ ఉద్యోగులమని ఆ ప్రభుత్వం, ఆ ముఖ్యమంత్రి ఇచ్చే ఆదేశాలను పాటించాల్సి ఉంటుందని చెప్పారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలతో ఉద్యోగ సంఘం ఉంటాయని, ప్రభుత్వాలు మారినప్పుడు ఆ సంఘాలు ఇబ్బందులు పడుతుంటాయని, ఆయా పార్టీల నాయకులు ఇబ్బందులు పెడుతుంటారని తెలిపారు. కానీ ఇక్కడ ఏపీ ఎన్జీవో సంఘం చాలా తటస్థంగా ఉంటుందని తెలిపారు. ఏ ప్రభుత్వం వచ్చినా మనం ఆ ప్రభుత్వంతో కలిసి పనిచేసే మద్దతు మనకు ముందు గనక సాఫీగా సాగుపోతుందన్నారు. సీఎంతో దగ్గరగా ఉండడంవలన ఈ పార్టీ ఏమో అని ముద్ర వేయదానికి కొంతమందికి అవకాశం ఉంటుందని తెలిపారు. కానీ మనకి ఏ సమస్య పరిష్కారం కావాలన్నా ముఖ్యమంత్రి ప్రధానం ఎవరు ముఖ్యమంత్రిగా ఉంటే వాళ్లతోనే మనం ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఆ ముఖ్యమంత్రి ఏ పార్టీకి సంబంధించిన వారైనా ఉద్యోగులకు సంబంధించి సౌకర్యాలు కల్పించాల్సిందే ముఖ్యమంత్రేనని కాబట్టి వారికి దగ్గరగా ఏపీఎన్జీవో ఉంటుందని వివరించారు. మనం ప్రభుత్వ ఉద్యోగులం ప్రభుత్వానికి సహకరిస్తేనే మన సమస్యలు పరిష్కార మవుతాయని తెలిపారు. తన 39 ఏళ్ల సర్వీస్లో కమర్షియల్ టాక్స్ శాఖలో బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చాయని తన శాఖతో పాటు అన్నిశాఖలకు చెందిన ఉద్యోగుల సహకారంతో ఏపీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెళ్లడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. జిల్లా నాయకత్వంలో ఉన్న సాయిరాం, చల్ల శ్రీనివాస్, వేణు అందరిదీ కూడా ఒకటే ఆలోచన అని మన దగ్గరికి ఎవరు వచ్చినా మనం పని చేయాలన్నదే ధ్యేయమని తెలిపారు. సాయిరాం ఆధ్వర్యంలో ఉన్న శ్రీకాకుళం జిల్లా నాయకత్వం కూడా చాలా ముందుండి చాలా పద్ధతిగా వెళ్తూ ఎంప్లాయిస్ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆ సమస్యలన్నిటిని పరిష్కరించడంలో చొరవ చూపుతోందన్నారు. సాయిరాం కూడా జిల్లా సెక్రటరీగా చక్కని బాధ్యతలను నిర్వహిస్తున్నారని కొనియాడారు. డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ ఉంటుందని దీనికి సంబంధించి విజయవాడలో కార్యక్రమాలు ఉంటాయని, జనవరి 5న జిల్లాలో మీ అందరి సమక్షంలో ఉద్యోగ విరమణ వేడుక నిర్వహిస్తామని తెలిపారు. పురుషోత్తంనాయుడుకు ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, శ్రేయోభిలాషులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల తగు చర్యలు తీసుకోవాలి

ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్

విశాలాంధ్ర-కవిటి: సీజనల్ వ్యాధుల పట్ల తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కడియాల పద్మా ప్రకాష్ వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలో గల రాజపురం పిహెచ్సి లో ఎంపీపీ కడియాల పద్మప్రకాష్ అధ్యక్షతన హెచ్ డి ఎస్ సమావేశం నిర్వహించారు .ఈ సమావేశంలో హాస్పిటల్ పెండింగ్ బిల్స్ ,సీజనల్ వ్యాధుల పట్ల తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సీజనల్ వ్యాధుల తీవ్రత పెరుగుతున్నందున పీహెచ్సీ పరిధిలో ఉయోగంలో ఉన్న మరియు నిరుపయోగంగా ఉన్న బోరు బావులు నేల బావుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లోరినేషన్ చర్యలు చేపట్టేలా సూచనలు చేశారు . రక్త పరీక్షల పై నిర్లక్ష్యం వహించకుండా ప్రతీ గడపనుండి నమూనాలు సేకరించి వ్యాధి తీవ్రతను నిర్మూలించే దిశలో అందరికీ అవగాహనకల్పించి ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కె శశిధర్, మౌనిక, ఎంపీటీసీ సభ్యులు సనపల కృష్ణారావు ,యలమంచి నీలయ్య ,ఎన్ని అశోక్, లొట్టి సోమేష్, హాస్పిటల్ సిబ్బంది, ఏఎన్ఎం లు ఆశవర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర-పొందూరు : మండలంలో సోమవారం నిర్వహించే పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవ వేడుకలు సందర్భంగా నిరుపేద విద్యార్థులకు అందివ్వవలసిన పాఠ్యపుస్తకాలను వర్షం కారణంగా కృష్ణాపురం అనే పల్లె గ్రామంలో అందివ్వలేని పరిస్థితి ఏర్పడింది.వీటి కారణంగా బుధవారం జిల్లా జనసేన పార్టీ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు గార బాబురావు సౌజన్యంతో కృష్ణాపురం ఎంపియుపి స్కూల్ పేద విద్యార్థులకు ఆ గ్రామ సర్పంచ్ అంబళ్ల శ్రీనివాసరావు చేతులమీదుగా ఆ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో సురేష్, వెంకటరావు, శ్రీనివాసరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటిఐ పరీక్షల్లో అవకతవకలు

ఆరోపణలపై తహాశీల్దార్ దర్యాప్తు

విశాలాంధ్ర-బొబ్బిలి : గత నెలలో ప్రభుత్వ ఐటిఐ లో వివిధ ట్రేడ్లలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో పలువురు విద్యార్థుల నుండి పరీక్షలకు పాస్ చేస్తామని డబ్బులు వసూలు చేశారని వచ్చిన ఆరోపణల పైన జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం తహాశీల్దార్ ఎం శ్రీను, రెవెన్యూ ఇన్స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి లు ప్రభుత్వ ఐటిఐలో సిబ్బందిని విచారించారు. అనంతరం ఆరోపణకు సంబంధించి వివరణను ఐటిఐ సిబ్బందిని తహాశీల్దార్ కార్యాలయంలో తహాశీల్దార్ ఎం శ్రీను విచారించారు. ఆరోపణల పైన వాస్తవాలు ఉంటే చర్యలు తప్పవని తాసిల్దార్ అన్నారు.

ఎన్నాళ్లు ఈ అవస్థలు

విశాలాంధ్ర-పలాస : మండలం చినంచల పంచాయతీ గోదావరిపురం గ్రామం నుంచి మెళియాపుట్టి పంచాయతీ గుడ్డిభద్ర గ్రామానికి మధ్య రహదారి దశాబ్దాల కాలం పాటు రోడ్డు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు కేవలం రెండున్నర కిలోమీటర్లు ఉంటుందని, అటు పలాస నియోజకవర్గానికి ఇటు పాతపట్నం నియోజకవర్గానికి శివారు ప్రాంతం కావడం వల్ల ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్డు పూర్తయితే రెండు నియోజకవర్గాల ప్రజలకు ప్రయాణం సమయం కలిసి రావడంతో ఈ ప్రాంతాభివృద్ధి చెందుతుందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఇక్కడ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని, ఆరోగ్య ఎమర్జెన్సీ విషయంలో కనీసం అంబులెన్సు కూడా వెళ్లలేని పరిస్థితిలో ఆ రహదారి ఉంది. సుమారు 10 గ్రామాలకు వెళ్లే రహదారి ఇలా ఉండడం ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పట్లేదు. రాష్ట్రంలో ఏర్పడిన ఎన్డిఏ ప్రభుత్వంలోనైనా రోడ్డు బాగు చేస్తారని ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

ఎస్టీయు జిల్లా అధ్యక్షులు యస్.వి.రమణ మూర్తి

విశాలాంధ్ర-లావేరు/రణస్థలం: ప్రతీనెలా ఒకటి రెండు తేదీలలో ఉద్యోగులకు జీతాలు జమ అవుతున్నాయనీ, ఇది ఉద్యోగులకు కాస్త ఊరట కల్గించే అంశమే కానీ గత కొన్ని సంవత్సరాలు ఉద్యోగులకు న్యాయంగా రావలసిన బకాయిలపై ఈ ప్రభుత్వం నోరుమెదపడం లేదని వెంటనే పాత బకాయిలను విడుదల చెయ్యాలని ఎస్టీయు జిల్లా అధ్యక్షులు యస్.వి.రమణ మూర్తి డిమాండ్ చేశారు. సంఘం నిర్మాణ విస్తరణ, సమస్యల సేకరణలో భాగంగా లావేరు మండలం అదపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఈ ఉద్యోగులకు దాదాపు 21,980 కోట్లు వరకూ బకాయి పడింది సాక్షాత్తు ముఖ్య మంత్రి ప్రకటించారని, ఈ బకాయిలు చెల్లింపులకు వంద రోజులు గడువు కావాలని చెప్పి, ఇంతవరకు ఎటువంటి ప్రకటన చేయలేదన్నారు. పదకొండువ వేతన సవరణ గడువు జూలై 2023తో ముగిసిందని గత ప్రభుత్వం పన్నెండవ వేతన సవరణ పై వేసిన కమీషన్ ఏలాంటి కార్యాచరణ లేకుండానే ఇటీవల కాలంలో చైర్మన్ రాజీనామా చేయడం జరిగిందన్నారు.వెంటనే ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన రెండు డిఎలు, ఐఆర్, పెండింగ్ బకాయిలపై దృష్టిసారించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్య వ్యవస్థను సర్వనాశనం చేస్తున్న జీ ఓ 117 తక్షణమే రద్దుచేసి, మెడ్జి స్కూల్లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులను వెనుక పంపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కూన శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు లక్ష్మణ్రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-హిరమండలం: ఇటీవల కలకత్తాలో డ్యూటీలో ఉన్న జూనియర్ డాక్టర్ మౌమితపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ దోషుల్ని కఠినంగా శిక్షించాలని మంగళవారం హిరమండలం పిహెచ్సి వద్ద ఆశకార్యకర్తలు యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేయడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు.కె.జ్యోతి. పూర్ణిమ.రాజేశ్వరి. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అత్యాచారానికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తక్షణమే తీసుకుని శిక్షించాలని నినాదాలు చేశారు. బెంగాల్ ప్రభుత్వం అసలు దోసులను దాచి పెడుతూ, ఒక్కరినీ మాత్రం అరెస్టు చేయటం దుర్మార్గం అని, మహిళలకు ఎక్కడ రక్షణ లేకుండా పోతుందని, పని ప్రదేశాల్లో నే కాకుండా, ఇంట్లో కూడా రక్షణ లేకుండా పోతుందని కనీసం ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలని, మహిళలకు పిల్లలకు రక్షణ కల్పించాలని, మహిళలపై జరుగుతున్న ఈ అత్యాచారాలు భారతావని సిగ్గుపడేలా ఉన్నాయని, దోషులను కఠినంగా శిక్షించేంతవరకు పోరాటాలు సాగుతూనే ఉంటాయని, గతంలో ఢిల్లీ నడిబొడ్డులో జరిగిన నిర్భయ లాంటి ఘటనలు ఎన్ని జరిగినా నేరస్తులకు కఠినమైన శిక్షలు పడటం లేదు అన్నారు. ఆశ వర్కర్ యూనియన్ నాయకురాలు ఎల్ కామాక్షి మాట్లాడుతూ వేలాదిమంది ప్రాణాలు కాపాడిన డాక్టర్ కే ప్రాణరక్షణ లేకుండా పోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ యూనియన్ నాయకులు.అప్పలమ్మ. కుమారి.రమణమ్మ. జ్యోతి..లక్ష్మీ. తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల మౌళిక సదుపాయాలపై అవగాహన

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం గిరిజన గ్రామమైన మాలగోవిందపురం పంచాయతీ ఎస్ఆర్ నగర్ కాలనీలో ఎంపీడీఓ బి.వెంకటరమణ తదితరులు మంగళవారం గ్రామసభను నిర్వహించారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబానికి పక్కా ఇళ్లు, మంచినీటి సరఫరా, రహదారుల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం, నాణ్యమైన విద్య, నైపుణ్య వికాసం, అందరికీ ఆరోగ్యం, నాణ్యమైన విద్య, నైపుణ్య వికాసము, పౌష్టికాహారం, జీవనోపాదులు తదితర అనేక అంశాలపై గ్రామస్తులకు వివరించారు. అనంతరం ఎస్ఆర్ నగర్లో గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థుల భోజనంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా నాణ్యమైన భోజనం అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో మండల ఇంజనీరింగ్ అధికారి కె.రమేష్, పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రసాదరావు, వీఆర్వో జోగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమ కార్మికులు, ఉద్యోగుల ఔదార్యం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమ (అరిణాం అక్కివలస)లో పనిచేస్తున్న కార్మికుడు లింగాల సన్యాసి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కార్మికుల, ఉద్యోగుల ఒక రోజు వేతనంతో గ్రాడ్యూటీతో కలిపి మొత్తం రూ.12,43,125 చెక్కును మృతుని భార్య ఈశ్వరమ్మ, కుమారుడు వరదరాజులుకు మంగళవారం అందజేశారు. ఈ చెక్కును పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ కె. శేషగిరిరావు. హెచ్ఆర్డీ హెడ్ కె. శ్యాంప్రసాదరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. తేజేశ్వరరావు చేతుల మీదుగా అందించి, కార్మికుల ఉద్యోగుల ఔదార్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ వర్కర్ల యూనియన్ నాయకులు ఎల్.రామప్పుడు, ఎం.రవ ణ, పి.నాగేశ్వరరావు, సీహెచ్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి ఎయిడ్స్పై అవగాహన

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని రాజపురం పిహెచ్ సి ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు వైసిబి ప్రివెన్షన్ యూనిట్ ట్రాక్టర్స్ ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో భాగంగా పీహెచ్సీ వైద్యులు శశిధర్,మౌనిక మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల సరైన అవగాహన చేసుకుని అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈ వై రవికుమార్ హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధులపై రిస్క్ అవగాహన సేవలు పై ప్రచారం చేసారు.ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ జె భారతమ్మ,వైద్య సిబ్బంది,ట్రాకర్ ప్రాజెక్టు సిబ్బంది,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-కవిటి:భైరిపురం ఫీడర్లో జల్లుపుట్టగ వద్ద ఏబీ స్విచ్ ఎరెక్షన్ కొరకు,డ్యామేజ్డ్ కేబుల్ మార్పు నిమితం బుధ వారం ఉదయం 9 గంటల నుండి సాయింత్రం 4 గంటల వరకు డీజీ పుట్టుగ, నెలవంక పంచాయతీల్లోని గ్రామాలకు మరియు వ్యవసాయ సర్వీసులకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగునని పలాస విద్యుత్తు శాఖ ఈఈ యోగేశ్వరరావు, కవిటి ఏఈ నేతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-పలాస : లయన్స్ క్లబ్ పలాస కాశీబుగ్గ ఆధ్వర్యంలో డాక్టర్. లయన్ తమ్మినేని పాపి నాయుడు కుమారుడు కిషన్ జన్మదినం సందర్భంగా మంగళవారం ముత్యాలమ్మ కోనేరు ఆవరణలో గల ఆంజనేయ స్వామి గుడి వద్ద పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. పలాస కాశీబుగ్గ మునిసిపల్ మాజీ చైర్మన్లు, యన్ వజ్జ బాబురావు కార్యక్రమాన్ని ప్రారంభించగా, లయన్స్ క్లబ్ అధ్యక్షులు హెచ్. వై.దొర, ప్రధాన కార్యదర్శి తమ్మినేని మాధవరావు, కోశాధికారి నెమలిపురి అప్పారావు, జడ్ సి రోణంకి హేమాచలం, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ కుమార్ నాయక్, లయన్ కెపి రామన్న పాల్గొన్నారు. వారం రోజులపాటు కురిసిన జడివానలకు సుమారు 80 మంది పేదలకు అన్న ప్రసాదాలు (భోజన సౌకర్యం) కల్పించడం జరిగిందని క్లబ్ సభ్యులు తెలిపారు.

గాయపడిన వ్యక్తికి వైకాపా ఆర్థిక సాయం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ ఫార్మా కంపెనీలో, ఇటీవల జరిగిన ప్రమాదంలో సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర గ్రామానికి చెందిన పంగశ్రీనివాసరావు గాయపడడంతో, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మంగళ వారం ఆర్థిక సహాయం అందజేశారు. వైఎస్ఆర్సిపి టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ చేతుల మీదుగా, బాధితుడికి లక్ష రూపాయలను చెక్కును పార్టీ తరఫున అందజేసారు. గాయాల నుండి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని వైఎస్ఆర్సిపి పార్టీ అధినేతవైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశిస్తున్నారని నియోజవర్గం ఇంచార్జ్ పేరాడతిలక్ బాధితుడికి తెలియజేశారు. ఈకార్యక్రమంలో నందిగాంఎంపీపీ ఎం శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి జడ్పిటిసిదుబ్బ వెంకటరావు, కోటబొమ్మాళి ఎంపీపీ రోనంకి ఉమామల్లేశ్వరరావు, వైయస్ఆర్ సీపీ నాయకులు పంగరామయ్య, పంగఅప్పన్న, మార్పు నాగభూషణరావు, పి.రామకృష్ణ, కొన్నశ్రీరాములు, కళింగపట్నం నాగరాజు, జి.చంద్రరావు, సుబ్బారావు, అన్నెపు రామారావు, చిన్ని జోగారావు, తదితరులు ఉన్నారు.

నాగావళి బ్రీచ్ల పరిశీలన

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలం తమ్మినాయుడుపేట, పొన్నాడ, కాళింపేట, లావేటిపేట, బొంతలకోడూరు గ్రామాల నాగావళి వద్ద బ్రీచ్లను అధికారులు మంగళవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల బృందం పరిశీలించింది. ఇరిగేషన్ డీఈఈ జీవీ రమణ, ఏఈఈలు శ్రీనివాసరావు, రాంబాబు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు బ్రీచ్లను పరిశీలించారు. కొత్తగా గ్రోయన్స్ ఎక్కడెక్కడ నిర్మించాలన్న విషయాన్ని చూశారు. అలాగే నదిలో నీటి ప్రవాహం అధికమైతే ఎలాంటి సమస్యలు వస్తాయన్న విషయాన్ని గుర్తించారు. ఇసుక ర్యాంపుల వల్ల ఇబ్బందులు ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించారు.

రక్తదానంతో స్ఫూర్తి దాతలు కావాలి : జనసేన పిలుపు

విశాలాంధ్ర-చీపురుపల్లి : రక్తదానం చేసి ప్రతి ఒక్కరు స్ఫూర్తి దతలు కావాలని చీపురుపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ అధ్యక్షులు విసినిగిరి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నాడు చీపురుపల్లి మండలం పత్తికాయ పాలవలస గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు పురస్కరించుకొని నిర్వహించిన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవలో మెగా ఫ్యామిలీ ఆశయాలను ప్రతి ఒక్క యువత అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బైరెడ్డి మధు, జి భాస్కరరావు, చీపురుపల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకులు జన సైనికులు వీర మహిళలు ప్రతి గ్రామ గ్రామాన ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం వారి యొక్క సేవా దృక్పథానికి నిదర్శనమని ప్రతి జన సైనికుడికి పేరుపేరునా ఆయన ఆయన అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పలువురు జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

సుజల స్రవంతి పనులపై అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

విశాలాంధ్ర-వేపాడ : బాబు జగజ్జీవన్ రావు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ లెఫ్ట్ కెనాల్ పనులపై అధికారులతో శృంగవరపు కోట ఎమ్మెల్యే వాళ్ల లలిత కుమారి సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. మంగళవారం లక్కవరపుకోటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు అలాగే ల్యాండ్ ఎక్కువి టేషన్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్యాకేజ్ -2 ప్రాజెక్ట్ స్థల పరిశీలనలో భాగంగా అధికారులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.మురళీకృష్ణ,స్పెషల్ డిప్యూటీ తాసిల్దార్ పి.రమేష్, డీజీఎం గజా కంపెనీ కే.సతీష్,డీఈ బి. లక్ష్మి సుధాలతో చర్చించి పనుల నిర్వహణపై రైతులకు ఏవిధంగా నష్టపరిహారం చెల్లిస్తున్నారో తదితర అంశాలపై ఆరా తీశారు. అలాగే సత్వరమే పనులు ప్రారంభమై దిశగా పనులు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుజల స్రవంతి ప్రాజెక్టులో భూములున్న రైతులు ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్ నాయుడు, ఎల్కోట మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, ఎల్.కోట మండల పార్టీ అధ్యక్షులు చొక్కాకుల మల్లునాయుడు,వే పాడ మండల పార్టీ ఉపాధ్యక్షులు పోతల వెంకటరమణ,కోన సత్యం,డెక్క దేముడునాయుడు,పిన్నింటి రమేష్,పిల్లా అప్పలరాజు రైతులు తదితరులు పాల్గొన్నారు.